క్లుప్తంగా

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ



గట్టు: జిల్లాస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో గట్టు కస్తూర్బా విద్యార్థినులు ప్రతిభను చాటుకున్నారు. శనివారం గద్వాలలో పోటీలు నిర్వహించినట్లు ఎస్‌ఓ గోపిలత తెలిపారు. ఇందులో కస్తూర్బా పాఠశాలకు చెందిన ముగ్గురు బాలికలు స్రవంతి అండర్–16 షాట్‌పుట్‌లో మొదటి స్థానం, రూబీ అండర్– 16 లాంగ్‌జంప్‌లో మొదటి స్థానం, మానస అండర్–16 లాంగ్‌జంప్‌లో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఎస్‌ఓ పేర్కొన్నారు.

చేనేత భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి



రాజోళి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత భరోసా పథకానికి చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని చేనేత జౌళి శాఖ ఏడీఓ ఉపేంద్ర అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో చేనేత కార్మికులకు భరోసా పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకంపై కార్మికులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అర్హులకు రూ.24 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. దరఖాస్తులను చేనేత జౌళీ శాఖ కార్యాలయంలో అందించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు, చేనేత సహకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

పొలాల్లో జింకల సందడి



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు గ్రామ శివారులో శనివారం పరుగో.. పరుగు అంటూ జింకలు అడవిలోకి పరుగెత్తడం చూపరులను ఆకట్టుకుంది. పలు జింకలు ఒకదాని వెనుక ఒకటి పరిగెత్తుకుంటూ అడవిలోకి వెళ్లాయి. ఈ దృశ్యాన్ని 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

ఫేస్ క్యాప్చర్ యాప్‌పై అవగాహన



ధరూరు: అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు సంబంధించి ఫేస్ క్యాప్చర్ తప్పనిసరిగా చేయాలని సీడీపీఓ వెంకటేశ్వరి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ధరూరు, కేటీదొడ్డి మండలాల అంగన్‌వాడీ టీచర్లకు పోషణ్ ట్రాకర్ యాప్‌పై అవగాహన కల్పించారు. చిన్నారులకు అందే పౌష్టికాహారం ఇక నుంచి యాప్ ఆధారంగానే వస్తుందని, ప్రతి విద్యార్థి ఆధార్ కార్డును ఆధారం చేసుకుని ఫేస్ క్యాప్చర్ చేయాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ నరేష్, సూపర్‌వైజర్ సురేఖ, అంగన్‌వాడీ టీచర్లు వీరమ్మ, వజ్రమ్మ, నాగమ్మ, జయమ్మ, రియాబేగం, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

మల్దకల్: మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన హరిజన్ కర్రెన్న, సవారమ్మ దంపతులకు శనివారం స్థానిక ఎస్‌ఐ నందికర్ రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. మానవత్వంతో నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. సోషల్ మీడియోలో వచ్చిన వార్తకు స్పందించి తమ వంతు ఆర్థిక సహాయన్ని అందజేసినట్లు పేర్కొన్నారు.

తాగునీటి కోసం అవస్థలు



ఇటిక్యాల: మండల పరిధిలోని సాతర్ల గ్రామంలో తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. బోరు చెడిపోయి నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని చేతి పంపులు, వ్యవసాయ బోర్ల వద్దకు నీటి కోసం పరుగులు పెడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇట్టి విషయమై పంచాయతీ కార్యదర్శి నారాయణను సాక్షి వివరణ కోరగా.. సమస్య తన దృష్టికొచ్చిందని బోరు సమస్య పనులు ప్రారంభించామని రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- కంపోస్టు తయారీపై అవగాహన కరువు
- డంపింగ్‌యార్డుల్లో చెత్త కాల్చివేత
- పట్టించుకోని అధికారులు



అమరవాయిలో నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు

మల్దకల్: గ్రామాల్లో ఇంటింటా సేకరించిన చెత్త నుంచి సేంద్రీయ ఎరువులు తయారు చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. సేకరించిన చెత్త ద్వారా తయారు చేసిన ఎరువులను రైతులకు విక్రయించి గ్రామ పంచాయతీల ఆదాయం పెంచాలని భావించింది. దీనికి తోడు గ్రామాల్లో పారిశుద్ధ్యంతో పాటు స్వచ్ఛతను మెరుగుపరిచే అవకాశం ఉంటుందని ప్రభుత్వం ముందు చూపుతో ఆలోచన చేసింది. అయితే ఆచరణలో మాత్రం సెగ్రిగేషన్ షెడ్ల వినియోగంలో ముందడుగు పడటం లేదు.

131 పంచాయతీల్లో

గద్వాల నియోజకవర్గం 5 మండలాల్లో 131 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామ పంచాయతీకి ఒక సెగ్రిగేషన్ షెడ్డు నిర్మించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో సెగ్రిగేషన్ షెడ్లలో కంపోస్టు ఎరువు మాత్రం తయారు చేయడం లేదు. దీనికి తోడు సేకరించిన చెత్తను ఖాళీ స్థలాలు, డంపింగ్ యార్డుల్లో తగుల బెడుతున్నారే తప్పా సేంద్రీయ ఎరువుల తయారీకి వినియోగించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డులు దుర్గంధం వెదజల్లుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో నిర్మాణానికి రూ.2.50 లక్షలు

ఒక్కొక్క గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం ఈజీఎస్ ద్వారా రూ.2.50 లక్షల నిధులు ఖర్చు చేసింది. అయితే డంపింగ్‌యార్డుల నుంచి వేరుచేసిన తడి, పొడి చెత్తను వేర్వేరుగా పోగుచేసి సేంద్రీయ ఎరువులు తయారు చేసే విధానంపై పంచాయతీ, పారిశుద్ధ్య కార్మికులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులకు ఎలాంటి శిక్షణ ఇవ్వలేదు. కార్మికులకు అవగాహన లేకపోవడంతో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి అక్కడ తగలబెడుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలో సేంద్రీయ ఎరువులు తయారు చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం లక్షలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారుతున్నాయని పేర్కొంటున్నారు.

అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా

కొన్ని గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు ఊరికి చివరన చెరువు కట్టల వెంట నిర్మించారు. ప్రస్తుతం ఈ షెడ్లు అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. రాత్రుళ్లు ఆకతాయిలకు, మద్యం ప్రియులకు అడ్డాలుగా మారాయని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్నా షెడ్లను వినియోగంలోకి తెచ్చి సేంద్రీయ ఎరువులు తయారు చేయాలని నియోజకవర్గ రైతులు కోరుతున్నారు.



నీలిపల్లి సమీపంలో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

ఎరువుల తయారీపై శిక్షణ ఇవ్వాలి



మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లలో వర్మీ కంపోస్టు ఎరువుల తయారు చేయాలి. పంచాయతీ కార్మికులకు ఎరువుల తయారీపై శిక్షణ ఇచ్చి గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరే విధంగా చర్యలు తీసుకోవాలి.

– రాముడు, నాగర్‌దొడ్డి

వినియోగంలోకి తెస్తాం



గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఎరువుల తయారీపై గ్రామ పంచాయతీ సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సేంద్రీయ ఎరువుల తయారీ చేపడుతాం.

– ఆంజనేయరెడ్డి, ఎంపీడీఓ, మల్దకల్

ఉత్తమ సంఘాల సభ్యులకు సన్మానం



ఉత్తమ సంఘాల మహిళలను సన్మానిస్తున్న అధికారులు

గట్టు: ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ బీఎం సంతోష్ సన్మానించారు. 4 మహిళా సంఘాలకు సంబంధించిన మహిళలు ప్రభావతి, శ్యామల, మహేంద్రమ్మ, సాధికా బేగంను ఎమ్మెల్యే కలెక్టర్లు సన్మానించి అభినందించారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి మొత్తం 495 సంఘాలకు గాను రూ.47.96 లక్షల చెక్కును మహిళా సంఘాలకు అందజేశారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా మహిళలకు వ్యాపార ప్రోత్సాహం కింద మహిళలు వ్యాపారాలు ప్రారంభించి, ఆదాయం పొందేలా ప్రోత్సహించడం, వారికి అవసరమైన శిక్షణ, మార్కెటింగ్ సహాయం అందించినట్లు ఐకేపీ, డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. రుణబీమా పథకం ద్వారా మిట్టదొడ్డి గ్రామానికి చెందిన సుజాతకు రూ.85 వేలు సంఘం లోన్‌బీమాను అందజేశామన్నారు. 15 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వయస్సు వరకు సంఘంలో సభ్యులుగా చేరడానికి అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. దివ్యాంగ సంఘాలు 12, కొత్త మహిళా సంఘాలు 31, వృద్ధ సంఘాలు 41, కిశోర బాలికల సంఘాలు 21 సంఘాలు ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ ఏపీఎం జయాకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికరమైన ఆహారం అందించాలి



బీచుపల్లి గురుకులంలో స్టోర్‌రూం పరిశీలిస్తున్న జడ్జి మిథున్ తేజ

ఎర్రవల్లి: గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని అలంపూర్ జూనియర్ సివిల్ జడ్జి మిథున్‌తేజ అన్నారు. మండల న్యాయ వి/స్థాన సదస్సు కార్యక్రమంలో భాగంగా శనివారం బీచుపల్లి గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, డార్మిటరీ గదులు, కిచెన్, స్టోర్‌రూం, మరుగుదొడ్లు, స్నానపు గదులు పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు కంపుకొడుతున్నాయని, కూరగాయలు కుళ్లిపోయాయని, వంట సామాగ్రి అపరిశుభ్రంగా ఉన్నాయని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లలో నీటి సరఫరా లేకపోవడంతో విద్యార్థులు స్నానం చేయకుండానే పాఠశాలకు వెళ్లడాన్ని గమనించి తక్షణమే ప్రత్యామ్నాయంగా నీటి సరఫరాను కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి మౌలిక సదుపాయాలు, వసతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారంలో మళ్లీ పాఠశాలను సందర్శిస్తానని అప్పటిలోగా పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, సీఏజీపీ మధు, న్యాయవాదులు శ్రీధర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, కర్ణాకర్‌రావు, యాకోబు, నాగయ్య, వెంకటేష్, లోక్‌అదాలత్ ఇన్‌చార్జ్‌లు సాయితేజ, జహంగీర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుకు సత్వర పరిష్కారం

గద్వాల క్రైం: ఏటీఎంలో సాంకేతిక సమస్య కారణంగా రూ. 8 వేల నగదును వదిలేసి వెళ్లిన బాధితుడికి తిరిగి అందజేసిన ఘటన గద్వాల పట్టణ పోలీసు స్టేషన్‌లో జరిగింది. ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ కథనం మేరకు.. బిహార్‌కు చెందిన వినోద్ శనివారం ఉదయం పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎం మిషన్‌లో తన వ్యక్తిగత ఖాతాలో నగదు జమచేసి వెళ్లాడు. అయితే సాంకేతిక సమస్య కారణంగా నగదు బయటకు వచ్చింది. ఈ క్రమంలో ఏటీఎం ద్వారా జమ చేసిన నగదు ఖాతాల్లోకి రాకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీటీవీ కెమెరాల విభాగా సిబ్బంది చంద్రయ్య, కిరణ్‌కుమార్ తనిఖీ చేయగా ఖాతాల్లో నగదు డ్రా చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి ఆ నగదును తీసుకున్నట్లు గుర్తించి వాకబు చేశారు. దీంతో నగదు తీసుకెళ్లిన వ్యక్తి రూ. 8 వేల నగదును పోలీసులకు అందజేయగా అట్టి నగదును బాధితుడు వినోద్‌కు అందజేసినట్లు పేర్కొన్నారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు

అయిజ: వర్షాలు కురవక పంటలు ఎండిపోతున్నాయని, సకాలంలో సరైన వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన భక్తులు శుక్రవారం రాత్రి స్వగ్రామం నుంచి కాలినడకన బీచుపల్లి వద్ద కృష్ణానది వద్దకు చేరుకొని గంగ పూజ చేశారు. శనివారం నదీ జలాన్ని స్వగ్రామానికి తెచ్చి ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకం చేశారు.



పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



అయిజ: మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు సిబ్బందిని ఆదేశించారు. శనివారం మున్సిపల్ సిబ్బంది వివిధ కాలనీల్లో పేరుకున్న మురుగు తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంక్ 79వ స్థానం సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. సిబ్బంది ఉత్సాహంగా పనిచేసి మున్సిపాలిటీ కార్యాలయానికి మంచి పేరు తేవాలని కోరారు.

సొంత ఖర్చులతో బోరుకు మరమ్మతు

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో నాలుగు రోజుల క్రితం బోర్ మోటార్ కాలిపోయి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామానికి తాగునీరు అందించే మోటార్ చెడిపోవడంతో మిషన్ భగీరథ నీళ్ల సరాఫరా రాక గ్రామస్తులు తాగునీటి కోసం తంటాలు పడ్డారు. ఈ క్రమంలో గ్రామస్తుడు గోపి స్పందించి సొంత ఖర్చుతో బోరుకు మరమ్మతు చేయించాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు గోపికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బోనాలు రాష్ట్ర సంస్కృతికి ప్రతిబింబం



గద్వాల: బోనాలు రాష్ట్ర సంస్కృతికి ప్రతిబింబమని, విద్యార్థులందరూ బోనాలు జరుపుకోవడం సంతోషంగా ఉందని పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలలో మొక్క నాటారు. కార్యక్రమంలో శంకర్, అశోక్, భాస్కర్, చిన్నయ్య, మాకం బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

ఎర్రవల్లి: మండల కేంద్రంలో దోపిడీ దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి కూడలిలోని మూడు షాపుల్లో ఒకేసారి చోరీకి పాల్పడి రూ.12,000 నగదు, 70 కేజీల ఉక్కు పెన్నాన్ని అపహరించారు. శనివారం ఆయా షాపుల యజమానులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పాఠశాలలో బోనాల సంబరాలు



ధరూరు: మండల పరిధిలోని నీలహళ్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన బోనాల సంబరాలకు ఎంఈఓ రవీంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. అనంతరం విద్యార్థులు బోన మెత్తుకుని ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు బీచుపల్లి, సంతోష్, రేణుక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాదిరి ఎన్నికపై అవగాహన

మల్దకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు శనివారం మాదిరి సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికను ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ నిర్వహించారు. ఈ విద్యార్థులకు సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికల సంబంధించిన ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే ఓటు హక్కు దాని విలువ తెలిజేయడం ఎంతో అవసరమన్నారు. అలాగే ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నందికర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటిని పట్టుదలతో సాధించాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ట్రస్టులు దోహదం చేస్తున్నాయన్నారు. పాఠ్యంశాలపై ఆసక్తిని పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడేలా విద్యను ఆచరణలో పెట్టాలని సూచించారు. విద్యార్థులు పుస్తకాల్లో నేర్చుకునే విషయాలు నిజ జీవితంలో ప్రయోగించి, సమాజానికి ఉపయోగపడేలా చేయాలన్నారు. కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు విషయ పరిజ్ఞానం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు రత్నసింహారెడ్డి, మమత, హెచ్‌ఎం వెంకటనర్సయ్య, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, రామన్‌గౌడ్, బాబర్, మురళీ, నాగిరెడ్డి, నరహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై రాజకీయ ఒత్తిడి సరికాదు



ఇటిక్యాలలో మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

ఇటిక్యాల: ప్రభుత్వ అధికారులపై రాజకీయ నాయకులు ఒత్తిడి చేయడం సరికాదని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన మరుగుదొడ్ల బిల్లులు పెట్టాల ని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి శ్యాంసుందర్‌పై ఆ సంస్థ జిల్లా చైర్మన్ నీలి శ్రీనివాసులు ఒత్తిడి తీసుకురావడం ఎంతవరకు సమంజసమన్నారు. గ్రంథాలయనికి వచ్చే పాఠకుల ముందు ప్రభుత్వ అధికారిని అవమానించడం అంటే ప్రభుత్వాన్ని అవమానించడమేనని ఆరోపించారు. చేయని పనులకు బిల్లులు పెట్టాలని ఒత్తిడి చేయడం, ప్రభుత్వ అధికారులపై దాడులు చేయడం అన్యాయమన్నారు. గ్రంథాలయ చైర్మన్‌కు చిత్తశుద్ధి ఉంటే జిల్లా కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న గంథ్రాలయ భవనా న్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్న, రాజు, రామకృష్ణ, ఏసన్న, పాల్గొన్నారు.

ఉద్యోగులకు రక్షణ కల్పించాలి

అయిజ: రాజకీయ నాయకుల బారి నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని బీఎస్పీ జిల్లా కార్యదర్శి శివవర్మతేజ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి అధికారులపై రాజకీయ నాయకుల దాడులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాని ఆరోపించారు. కార్యక్రమంలో రాజారత్నం, నరసింహులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో ఉన్నత స్థానాలకు



విద్యార్థులతో మాట్లాడుతున్న స్నిగ్ధారెడ్డి

కేటీదొడ్డి: విద్యార్థినులు ఆత్మ విశ్వాసంతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాలుగు రోజుల క్రితం విద్యార్థి ప్రమాదవశాత్తు కింద పడిన విషయం విషయం తెలుసుకున్న ఆమె విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థులను నెలకొన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు ఆశల మేరకు చదివి వారికి మంచి పేరు తీసుకురావాలన్నారు. హోంసిక్ అనేది కొద్ది రోజులు ఉంటుందని, నేను కూడా హాస్టల్లో అనుభవించానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, బలిగేరా శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు



సప్తాహ భజనలు నిర్వహిస్తున్న బృందం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అరవిందరావు, మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

ప్రారంభమైన సప్తాహ భజనలు

ఆదిశిలా క్షేత్రంలో సప్తాహ భజన కార్యక్రమాలను సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి ప్రారంభించారు. వారం రోజుల పాటు నిర్వహించే భజన కార్యక్రమాల్లో జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు పాల్గొననున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

ఆస్పత్రుల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలి



మాట్లాడుతున్న దానయ్య

గద్వాల: ప్రభుత్వ ఆస్పత్రులలో సౌకర్యాలు మెరుగుపర్చాలని, సీజనల్ వ్యాధులు అరికట్టేలా చర్యలు తీసుకోవాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు దానయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో సీజన్ వ్యాధులతో పాటు, అంటు వ్యాధులు కూడ ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆస్పత్రులలో సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. అదే విధంగా వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలన్నారు. అలంపూరు చౌరస్తాలోని వంద పడకల ఆస్పత్రిని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, హరీష్, కోళ్ల అంజి, రంగస్వామి, పగుల్‌రాజు, కిరణ్ పాల్గొన్నారు.

ప్రజల భద్రత పట్టించుకోరా?



ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న బీజేపీ నాయకులు

రాజోళి: ప్రజల భద్రతను పట్టించుకోకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తే ఎలా అని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. శనివారం శాంతినగర్ పట్టణంలోని మహాలక్ష్మీ కాంప్లెక్స్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును వారు వ్యతిరేకించారు. కాంప్లెక్స్‌లో స్థలం ఏర్పాటు చేస్తే అక్కడ పెట్టకుండా నిత్యం వేలాది మంది ప్రజలు, వందలాది వాహనాలు తిరుగుతూ నిత్యం రద్దీగా ఉండే కర్నూలు– రాయచూర్ ప్రధాన రహదారికి ఆనుకుని ఏర్పాటు చేయడం ఏంటని మండిపడ్డారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్షణమే తరలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ శాంతిగనర్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, వెంకటేశ్వర్లు, శివ, రాజశేఖర్‌గౌడ్, పరుశరాముడు, అనిల్ తదిదరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలతో సోదరభావంతో ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎత్తం శివ

మానవపాడు: ఆడపిల్లలతో సోదర భావంతో మెలగాలని జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఎత్తం శివ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలలు వేధింపులకు గురయితే 100, 1098ను సంప్రదించాలన్నారు. సామాజిక మధ్యమాల ద్వారా చెడు అలవాట్లకు లోనుకాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్, ఉపాధ్యాయులు రామేశ్వర్, విజయమ్మ, శ్రీలేఖ, అలియా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.